

పూజలు చేసిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## విద్యార్చన మహోత్సవంలో ఎమ్మెల్యే

సంగారెడ్డి, జనవరి5: అనఘాశక్తి యాగసహిత విద్యార్చన మహోత్సవంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం పోతిరెడ్డిపల్లి అనంతరెడ్డి కాలనీలో లోకరెడ్డిగారి విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో అనఘాశక్తి యాగసహిత విద్యార్చన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతిర్వాసు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో యాగం జరిపించారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆశీర్వచనాలు అందజేశారు. జ్యోతిర్వాసు విద్యాపీఠంలో ఆదివారం రోజు రక్తదాన, దంత, నేత్ర దానాల శిబిరాలు ఏర్పాటు చేస్తునట్లు ఎమ్మెల్యేకు సిద్ధాంతి వివరించారు. కార్యక్రమంలో విఠల్‌రెడ్డి లక్ష్మి దంపతులతోపాటు లోకరెడ్డిగారి రాంరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, నాయకులు బొంగుల రవి, కాసాల రాంరెడ్డి, కొత్తకాపు శ్రీధర్‌రెడ్డి, మాజీ వీఆర్‌వో గోపాల్‌రావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## నేషనల్ అడ్వెంచర్‌లో సిద్దిపేట విద్యార్థి ప్రతిభ



పర్వతారోహణ చేసిన ఆగస్టిన్ అభినందిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట టౌన్, జనవరి 5: జాతీయ స్థాయి అడ్వెంచర్ క్యాంప్‌లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఆగస్టీన్ పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించడం కళాశాలకే గర్వ కారణమని ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 23 నుంచి ఈనెల 1వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన నేషనల్ అడ్వెంచర్ శిక్షణ క్యాంపులో ఆగస్టీన్ పాల్గొన్నాడన్నారు. హిమాలయాల్లోని 2875 మీటర్ల ఎత్తుగల ట్రియుండి పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించిడం స్ఫూర్తిదాయకం అన్నారు. పర్వతారోహణ బృందానికీ ఆగస్టీన్ కమాండోగా వ్యవహరించాడన్నారు. ఆగస్టీన్ ఘనత సాధించి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరుప్రఖ్యాతలను దేశవ్యాప్తంగా చాటాడని కొనియాడారు. విద్యార్థులు అతడిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పర్వతారోహణ చేసిన ఆగస్టీన్‌ను అధ్యాపకులు అభినందించారు.

## ఇర్కోడ్ మహిళా సమాఖ్య సభ్యులకు శిక్షణ



శిక్షణ శిబిరంలోని మహిళలతో మాట్లాడుతున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట, జనవరి5: శిక్షణలో మెళకువలు పొంది, నాణ్యమైన, రుచికరమైన ఉత్పత్తులను తయారు చేసి వినియోగదారుల ఆదరణతో మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆకాంక్షించారు. సిద్దిపేట స్లాటర్ హౌస్ వద్ద కంట్రీ చికెన్ సంస్థ ఆధ్వర్యంలో ఇర్కోడ్ మహిళా సమాఖ్య ఫుడ్ ప్రోడక్టు సంఘం సభ్యులకు వెజ్ అండ్ నాన్ వెజ్ వంటకాలపై నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్‌లోని మహిళా సమాఖ్య సంఘం సభ్యులు తయారు చేసిన వెజ్, నాన్ వెజ్ పచ్చళ్లను ఉత్పత్తి చేసి రాష్ట్ర స్థాయిలో విక్రయించాలనే లక్ష్యంతో హైదరాబాద్ కంట్రీ చికెన్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారన్నారు. సిద్దిపేట స్లాటర్ వద్ద కేటాయించిన భవనంలో గురువారం నుంచి ఆరు రోజుల పాటు మహిళలకు వంటకాల తయారీపై శిక్షణ ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ జయదేవ్ ఆర్యా, అధికారులు రవీందర్, కుమారస్వామి, కరుణాకర్, వాసుదేవ్, సాగర్, విజయ నిర్మల పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలి

- నేటితో ప్రజాపాలన దరఖాస్తులకు ఆఖరు
- అధికారుల పర్యవేక్షణ భేష్
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు కాంత్రి



రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శుక్రవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరు క్రాంతిని శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

కొండాపూర్, జనవరి 5: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి కాంత్రి సూచించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని గుంతపల్లి గ్రామంలో ప్రజాపాలనను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఈలాంటి పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలన్నారు. ప్రభుత్వం అందిచనున్న ఆరు గ్యారంటీల్లో లబ్ధిదారుల దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కొండాపూర్ మండలంలో ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఎలా నింపుతున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫారంలోని ప్రతి విషయాన్ని పరిశీలించిన తర్వాతనే రసీదు ఇవ్వాలన్నారు. దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తున్నందున ఇంకా ఎవరైనా అందుబాటులో లేకుండా ఉంటే వారికోసం మండల కేంద్రంలో ఒక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు అక్కడ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమిత్రమ్మ, ఎంపీపీ మనోజ్‌రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ ఏడీ, మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో మధులత, తహసీల్దార్ అనిత పాల్గొన్నారు.

# అసమర్థతను కప్పిపుచ్చుకోడానికే నిందలు

- చైర్మన్ రాజీనామాతో నర్సాపూర్‌కు దరిద్రం పోయింది
- కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయాలి
- స్క్రాప్ అవినీతిని బయటపెడతాం
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కౌన్సిలర్ అశోక్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు

నర్సాపూర్, జనవరి 5: మున్సిపల్ చైర్మన్‌గా రాజీనామా చేసిన మురళీయాదవ్ తన అసమర్థతను కప్పిపుచ్చుకోడానికి బీఆర్‌ఎస్‌పై నిందలు వేస్తున్నాడని కౌన్సిలర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అశోక్‌గౌడ్ ధ్వజమెత్తారు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్ అభివృద్ధి చెందలేదని మురళీయాదవ్ ఆరోపించడం అవివేకమన్నారు. 25 ఏండ్లుగా పార్టీలో ప్రజాప్రతినిధిగా ఉన్న మురళీయాదవ్ తన అసమర్థతను తానే చెప్పుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. పార్టీలో ఉండి తాను అభివృద్ధి చెంది, నర్సాపూర్ అభివృద్ధిని గాలికి వదిలేశాడని దుయ్యబట్టారు. కారు గుర్తు మీద కౌన్సిలర్‌గా గెలిచి నేడు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావును విమర్శించడం సమంజసం కాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి డిపాజిట్ కోల్పోయాడని గుర్తుచేశారు. ఆయన సొంత వార్డు ప్రజలే తిరస్కరించారన్నారు. బీఆర్‌ఎస్ భిక్షతో గెలిచిన కౌన్సిలర్‌కు కూడా రాజీనామా చేయాలన్నారు. మున్సిపాలిటీలో స్క్రాప్ అమ్మకంలో మురళీయాదవ్ పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడ్డాడని, త్వరలోనే బయటపెడతామన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి బీఆర్‌ఎస్ హయాంలో రూ.65 కోట్ల నిధులు వచ్చాయని, మురళీయాదవ్ అసమర్థతతో పనులు జరగలేదన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా మురళీయాదవ్ రాజీనామాతో 25 ఏండ్ల నర్సాపూర్ దరిద్రం వదిలిందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ రాంచందర్, బీఆర్‌ఎస్ నాయకులు నగేశ్, ఆంజనేయులుగౌడ్, బాల్‌రెడ్డి, నాగరాజుగౌడ్, శ్రావణ్, రాకేశ్‌గౌడ్, సాగర్ పాల్గొన్నారు.

# గ్రామసభలా.. కాంగ్రెస్ సభలా ?

- ప్రొటోకాల్ పాటించని అధికారులు
- సర్పంచ్, ఉప సర్పంచ్ లేకుండానే గ్రామసభ
- ప్రజాపాలనలో ఎమ్మెల్యే ఫొటో లేదని సభను అడ్డుకున్న తునికి గ్రామస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు

కౌడిపల్లి, జనవరి 5: ప్రొటోకాల్ పాటించకుండా, స్థానిక ప్రజాప్రతినిధులు రాకున్నా గ్రామసభ నిర్వహించడం విడ్డూరంగా ఉందని తునికి సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సభలు కాంగ్రెస్ సభల్లా నిర్వహిస్తున్నారని విమర్శించారు. మండలంలోని తునికి గ్రామంలో శుక్రవారం ప్రజాపాలనలో భాగంగా గ్రామసభ ఏర్పాటుచేశారు. ఉదయం 8 గంటలకు ఎంపీడీవో అధికారుల బృందం వచ్చి సర్పంచ్, ఉప సర్పంచ్ లేకుండానే గ్రామసభను ప్రారంభించారు. సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటో లేకపోవడం, స్థానిక సర్పంచ్ సాయిలు, ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి రాకుండానే సభ ప్రారంభించడంతో ఎంపీడీవో శ్రీనివాస్‌తో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొన్నది. సభకు సర్పంచ్, ఉప సర్పంచ్ రాకుండానే ఎంపీడీవో ప్రారంభించడం, ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు గ్రామసభను అడ్డుకున్నారు. ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో వేయాలని తమకు ఎలాంటి ఆదేశం అందలేదని ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఫొటో, స్థానిక సర్పంచ్ లేకుండా గ్రామసభను ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరంభంలోనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. అధికారికంగా నిర్వహించే కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మధుగౌడ్, మాజీ సర్పంచ్ సాయగౌడ్, నాయకులు అమర్‌సింగ్, కిరణ్ కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



తునికి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎంపీడీవో శ్రీనివాస్‌ను నిలదీస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# ఏసీబీ అధికారుల పేరిట రూ.50 వేలకు కుచ్చుటోపి

దుబ్బాక, జనవరి5: హలో.. మేము ఏసీబీ అధికారులం. నీపై పలు ఆరోపణలున్నాయి. నీవు అక్రమ సంపాదనకు పాల్పడుతున్నావ్.. అంటూ ఆధారాలతో మాకు ఫిర్యాదులు వచ్చాయి. మేము రైడ్ చేయకుండా ఉండాలంటే నువ్వు రూ.2 లక్షలు మేము చెప్పిన అకౌంట్‌కు వెంటనే పంపించాలి అని ఓ ప్రభుత్వ ఉద్యోగికి ఫోన్‌లో హెచ్చరిక వచ్చింది. దీంతో కంగుతిన్న ఆ ఉద్యోగి ఏ మాత్రం ఆలోచించకుండా ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి చెప్పిన ప్రకారం బ్యాంక్ అకౌంట్‌కు రూ.50 వేలు పంపించాడు. మిగిలిన డబ్బులు త్వరగా పంపించాలంటూ మళ్లీ ఫోన్ బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన బాధిత ఉద్యోగి ఇది కచ్చితంగా ఆన్‌లైన్ (సైబర్) మోసగాళ్ల పనేనని, వెంటనే 1930 నంబర్‌కు రిపోర్టు చేసి, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై గంగారాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మున్సిపల్ ఏఈ యాదగిరికి ఐదు రోజుల కింద అపరిచితుడు ఫోన్ చేశాడు. తాము ఏసీబీ బ్యూరో నుంచి కాల్ చేస్తున్నామని, మీపై పలు అవినీతి ఆరోపణలున్నాయని ఫిర్యాదు వచ్చిందన్నారు. మేము రైడ్ చేయకుండా ఉండాలంటే నువ్వు వెంటనే రూ.2 లక్షలు అకౌంట్‌కు పంపించాలని సూచించారు. దీంతో ఏఈ యాదగిరి వారు సూచించిన అకౌంట్‌కు ఆన్‌లైన్ ద్వారా రూ.50 వేలు పంపించాడు. మిగిలిన 1.05 లక్షలు డబ్బులు వెంటనే పంపించాలని బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో బాధితుడు ఏఈ యాదగిరి అప్రమత్తమై 1930 ఫోన్ చేసి రిపోర్టు చేశాడు. దాని ఆధారంగా దుబ్బాక పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడని,, ఈ విషయంలో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. అపరిచితుల ఫోన్లను నమ్మి మోసపోవద్దన్నారు.